క్లుప్తంగా

ఎంపీడీఓ ఆఫీస్ ఏఓగా వెంకటరావు


ఏఓ సీహెచ్‌కేవీ వెంకటరావు

సీతానగరం: మండలపరిషత్ కార్యాలయ పరిపానాధికారి(ఏఓ)గా సీహెచ్‌కేవీ వెంకటరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఓగా విధులు నిర్వహించిన ఎంఎల్ఎస్ ప్రసాద్ పదోన్నతిపై పాచిపెంట ఎంపీడీఓగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో దత్తిరాజేరు మండల పరిషత్ ఏఓగా పనిచేసిన సీహెచ్‌కేవీ వెంకటరావు బాధ్యతలు స్వీకరించారు. ఏఓ వెంకటరావు ఈ సందర్భంగా ఎంపీపీ బి.రమణమ్మను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనల మేరకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సహకారంతో మెరుగైన సేవలందించడానికి కృషిచేస్తానన్నారు.

కిశోరీ వికాసం వేసవి శిక్షణ ప్రారంభం


బలిజిపేట సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ సులేఖ

బలిజిపేట: కిశోరీ బాలికల సంరక్షణపై దృష్టి సారించాలని బలిజిపేట ప్రాజెక్టు సీడీపీఓ సులేఖ తెలిపారు. ఈ మేరకు బలిజిపేట సచివాలయంలో కిశోరీ వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరీ బాలికల అభివృద్ధి, సంరక్షణపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వారికి ఎటువంటి తర్ఫీదులు ఇవ్వాలనే దానిపై వివరించారు. ఇప్పటి నుంచి జూన్ 10వ తేదీ వరకు నిర్వహించాల్సిన కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్గధామంలో బోరు ప్రారంభం


బోరును ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములు నాయుడు

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురం గ్రామ స్వర్గధామంలో ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కరించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు అన్నారు.స్థానిక మాజీ సర్పంచ్ ఆర్‌అప్పలనాయుడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల కోరిక మేరకు మండల పరిషత్ నిధులు ఎంపీపీ బి.రమణమ్మ మంజూరు చేయడంతో ఏర్పాటు చేసిన బోరును ఆయన శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు మంచినీటి బోర్లు మంజూరుచేయగా పనులు పూర్తి కావడంతో నీటి సమస్య పరిష్కారమైనట్లు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

దరఖాస్తులాహ్వానం

సీతంపేట: మండలంలోని మల్లి పీవీటీజీ గురుకుల పాఠశాలలో పలు తరగతుల్లో ప్రవేశాలకు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఓ ప్రకటనలో శుక్రవారం కోరారు. మూడో తరగతిలో 80, నాలుగో తరగతిలో 16, ఐదో తరగతిలో 10, ఆరో తరగతిలో 1, ఏడో తరగతిలో 3, ఎనిమిదో తరగతిలో 6, తొమ్మిదో తరగతిలో 7 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 4వ తేదీ లాటరీ ద్వారా విద్యార్థుల ఎంపిక, సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి


నిరుద్యోగ యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబు

పాలకొండ రూరల్: ఉపాధి అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యామ్‌బాబు ఆకాంక్షించారు. కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువతను ఉద్దేశించి, ఆయన కాసేపు ప్రసంగించారు. వచ్చిన అవకాశం చిన్నదైనా అందుకోవాలని, ఆ చిన్న అవకాశంతోనే ఉన్నత స్థానాలు సాధించవచ్చన్నారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, డీవీస్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ మేళాకు 41 మంది హాజరుకాగా వివిధ ఉద్యోగాలకు 10 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు సీహెచ్ పూర్ణప్రసాద్, బి.పూర్ణచంద్ర, అజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి తదితరులు పాల్గొన్నారు.

పంటకు సంజీవని వేప

- భూసారానికి మేలు
- రకరకాల పద్ధతుల్లో వినియోగం


వేపచెట్టు

బలిజిపేట: వ్యవసాయంలో వేపకు అధిక ప్రాధాన్యం ఉంది. రైతుల పాలిట నేస్తంగా ఉన్న వేప సంబంధిత మందులను పంటల్లో విరివిగా వాడితే అధిక ప్రయోజనం పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. పంటలకు రోగ నిరోధక శక్తిని పెంపొందించే లక్షణాలు ఉండడం, కీటకనాశిని గుణాలు కలిగి ఉండడం దీని ప్రత్యేకత. వేపచెట్టు ఉత్పత్తులు అటు వ్యవసాయ, ఇటు ఆధ్యాన పంటల్లోనూ, ధాన్యం నిల్వలోనూ వివిధ రాపాల్లో వాడుకోవచ్చని చెబుతున్నారు. వేసవిలో వేప విత్తనాలను సేకరించుకుంటే వినియోగించుకునేందుకు అనువుగా ఉంటుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

• వేపతో ప్రయోజనాలు ఇలా..

వేపఆకులు లేదా ఆకు కొనలు పొడిచేసి నిల్వ చేసిన ధాన్యంలో కలిపితే పురుగులు పట్టవు. వేపాకుల కషాయంలో ముంచి ఆరబెట్టిన గోనె సంచులకు పురుగులు దరిచేరవు. ఎరువుగా వేపాకులు పొలంలో వేస్తే సేంద్రీయ పదార్థం, పోషకాలతో పాటు నిరోధక శక్తి కలిసివస్తాయి.

• వేప గింజలు:

వేపగింజల్లో 0.3నుంచి 0.6శాతం ఆజ్జాడివిక్టిన్ అనే మూల పదార్థం ఉంటుంది. ఇది ఘాటైన చేదు రుచి, వాసన కలిగిస్తుంది. ఈ మందులు వాడిన పైరుకు పురుగులు చేరవు. గుడ్లు పెట్టినా లార్వా దశలో రావాల్సిన మార్పులు రాకుండా సంతతి తగ్గిపోతుంది. క్రమేణా పురుగులు నశిస్తాయి. పంటలకు మేలు చేసే సహజ శత్రువులకు ఎలాంటి హాని కలుగచేయవు.

• వేపనూనె:

వేప నూనె పంటలపై పిచికారీ చేస్తే కాయతొలుచు పురుగు, రసం పీల్చు పురుగు, ఆకు తినే పురుగుల్ని అదుపుచేయవచ్చు. ఒక లీటరు వేపనూనెకు 200లీటర్ల నీరు, 200గ్రాముల సబ్బు పొడి(సర్ఫ్) కలిపి ద్రావణం తయారుచేసుకోవాలి. ఇది ఒక ఎకరాలో పిచికారీ చేయడానికి సరిపోతుంది. నూనె, నీరు కలవదు కనుక ముందుగా సబ్బు పొడి బాగా కలిపి నురుగువచ్చిన తరువాత నీటిలో కలపాలి.

• వేపగింజల కషాయం:

10కిలోల వేప గింజల పొడిని 200లీటర్ల నీటిలో కలిపి ఒక రోజంతా నానబెట్టాలి. ఈ ద్రావణానికి 2కిలోల సబ్బుపొడి వేసి బాగా కలియబెట్టిన తరువాత వడగట్టాలి. వచ్చిన కషాయాన్ని పైరుపై పిచికారీ చేస్తే తెల్లదోమ, ఆకుముడత పురుగులను సమర్థవంతంగా అరికట్టవచ్చు. తొలిదశలో చిన్న గొంగళి పురుగు, కాయ తొలుచు పురుగును అరికట్టే అవకాశం ఉంది. నూనె తీయగా మిగిలిన పిండిని నీటిలో కలిపి ద్రావణం చేసుకోవచ్చు. 10కిలోల పిండిని 200లీటర్ల నీటిలో కలిపి ఒక వారం రోజుల పాటు నానబెట్టి తరువాత తేటను వేరుచేసి మొక్కలపై పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

వేప పిండి: ఇది మేలైన చిక్కటి సేంద్రీయ ఎరువు. గింజ నుంచి తీసివేసిన వేప పిండిలో 5.2శాతం నత్రజని, 11శాతం భాస్వరం, 1.5శాతం పొటాష్ ఉంటుంది. ఇది ఎరువుగానే కాకుండా సస్యరక్షణకు ఉపయోగపడుతుంది. వేప పిండి ఎకరాకు 150–200కిలోలు వాడాలి. కొన్ని బాక్టీరియా తెగుళ్లను నివారిస్తుంది. నులి పురుగులను అదుపులో ఉంచుతుంది. వేపపిండిలో కలిపి యూరియాను వాడితే నత్రజని నెమ్మదిగా తగ్గుతుంది.

పర్యావరణ ప్రయోజనాలు

వ్యవసాయంలో వేప ఆధారిత ఉత్పత్తులను వినియోగించడం వల్ల లనేక పర్యావరణ ప్రయోజనాలు లభిస్తాయి. వేప జీవ అధోకరణం చెందుతుంది, పర్యావరణ వ్యవస్థలో పేరుకుపోదు. కాలుష్య ప్రమాదాన్ని తగ్గిస్తుంది. వేప నేల నాణ్యతను పెంచుతుంది. ఆరోగ్యకరమైన, స్థితిస్థాపక వ్యవసాయ వ్యవస్థను ప్రోత్సహిస్తుంది.
శ్రావణ్‌కుమార్, ఏఓ, బలిజిపేట

విపత్తుల సమయంలో మెలకువలు పాటించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్


విపత్తుల సమయంలో వినియోగించాల్సిన పరికరాల ప్రదర్శన

సీతానగరం: ప్రకృతి సిద్ధంగా విపత్తులు వచ్చినప్పుడు జరిగే ప్రమాదాల నివారణకు అధికారులు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించుకోవాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. ఏపీ విపత్తుల నివారణ సంస్థ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక పెద్దలకు అవగాహన సదస్సు శుక్రవారం కొత్తవలస డ్యామ్‌వద్ద జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తులు వచ్చినప్పుడు సువర్ణముఖి నదిపై కొత్తవలస డ్యామ్ వద్ద ప్రమాదాలు ఏవిధంగా జరుగుతున్నాయి? ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అందరూ అవగాహన కల్పించుకోవాలని కోరారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, వంటగ్యాస్ సిలిండర్లతో ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు మెలకువలు పాటించి ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ప్రమాదాలకు గురైన వారిని రక్షించడానికి తీసుకోవాల్సిన అంశాలను భౌతికంగా వివరించారు. అనంతరం మక్కువ మండలం వెంకటబైరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రజలకు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు, ఇన్‌చార్జ్ ఎస్సై నీలకంఠం, జిల్లాఫైర్ ఆఫీసర్ కె.శ్రీనుబాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జి.ప్రభాకర్ ఏఆర్ఎస్సై భాను పాల్గొన్నారు.

సచివాలయ సర్వేలను త్వరగా పూర్తిచేయాలి

- సీఈఓ సత్యనారాయణ


ఎంపీడీఓ కార్యాలయంలో రివ్యూ నిర్వహిస్తున్న సీఈఓ సత్యనారాయణ

బలిజిపేట: సచివాలయ సర్వేలను త్వరగా పూర్తిచేయాలని సీఈఓ సత్యనారాయణ కోరారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న సిటిజన్ ఈకేవైసీ, చిన్నారుల ఆధార్ గురించి, మన మిత్రలపై రివ్యూ సమావేశం నిర్వహించారు. నిర్ధారించిన ప్రకారం సర్వేలు నిర్వహించడంలో వెనుకబడి ఉన్నవారు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. సచివాలయాల వారీగా రివ్యూ నిర్వహించి ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఏఓ త్రినాథరావు, ఎంపీడీఓ నగేష్, ఈఓపీఆర్‌డీ పుష్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగరాదు

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ


అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

సాలూరు: శ్యామలాంబ పండగ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె తన ఛాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ కృష్ణారావుతో పాటు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లక్షల్లో భక్తులు పండగకు రానున్న నేపథ్యంలో అవసరమైన ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య పనుల నిమిత్తం పండగ రోజులు, పండగ పూర్తయిన రెండు రోజుల వరకు సుమారు 40 మంది పారిశుద్ధ్య కార్మికులను అదనంగా తక్షణమే నియమించి, విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సామాజిక మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. తాగునీటి పంపు వద్ద జనరేటర్‌ను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, కానిపక్షంలో పండగ మూడురోజులైనా ఆ సామర్థ్యం ఉన్న జనరేటర్‌ను అద్దెకు తీసుకువచ్చి ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని స్పష్టం చేశారు. మంత్రి, పండగ నిర్వహణ కమిటీ సభ్యులు శనివారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారని తెలియవస్తుండగా వారితో పాటు కౌన్సిలర్‌లతోనూ మంత్రి సమావేశం నిర్వహించేలా చూడాలని,ఈ విషయమై మంత్రితో మాట్లాడమని కమిషనర్‌కు సూచించారు. పట్టణంలో దోమలు విజృంభిస్తున్నాయని ఆ సమస్య పరిష్కరించాలని, విద్యుత్ ఏర్పాట్లు త్వరితగా పూర్తిచేయాలని సూచించారు. అధికారులు, సిబ్బంది ఎక్కడా విధినిర్వహణలో అలసత్వం వహించవద్దని కోరారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పండుగ ఏర్పాట్లకు సహకరించండి

శ్యామలాంబ పండగ ఏర్పాట్లకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు కోరారు. పండగకు లక్షలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో మొబైల్ టాయిలెట్స్, పార్కింగ్ ప్లేస్‌లను ఆయన శుక్రవారం పరిశీలించారు. పండగ ఏర్పాట్లపై సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

ఆపరేషన్ కాగార్‌ను నిలిపివేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం న్యూ డెమొక్రసీ నాయకులు

పార్వతీపురం టౌన్: ఆపరేషన్ కాగార్‌ను నిలిపివేయాలని సీపీఐ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి పోలా ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగార్ ఆపరేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మధ్యభారతం ఆదివాసీలపై యుద్ధం ప్రకటించిందన్నారు. ఆదివాసీలు నివసిస్తున్న కర్రెగుట్ట ప్రాంతంలో విలువైన ఖనిజాలు ఉన్నాయని, వాటిని అదానీ, అంబానీ, మిట్టల్, వేదాంత వంటి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి కేంద్రం పూనుకుంటోందని ఆరోపించారు. ఆదివాసీలకు అండగా ఉన్న మావోయిస్టులను అంతమొందించడానికి కేంద్రప్రభుత్వం పూనుకుంటోందని, ఒకపక్క కేంద్ర ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టు పార్టీ లేఖలు రాసినా పట్టించుకోకుండా వారిని హతమార్చే లక్ష్యంతో సైనిక బలగాలు వెంటాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎం.గోపాలం ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి, పి.రమణి, పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, అఖిల భారత రైతు కూలీ జిల్లా ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

212 హైరిస్క్ మలేరియా గ్రామాల్లో.. దోమల నివారణ మందు పిచికారీ


దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న దృశ్యం

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని 212 హైరిస్క్ మలేరియా గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చర్యలు చేపడుతున్నట్లు శ్రీకాకుళం డీఎంవో పీవీ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం కోసంగి, బూర్జగూడ గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో పర్యవేక్షించి, స్ప్రేయింగ్ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. మండలంలోని కురసింగి గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. పలువురు మలేరియా బారినపడి బాధపడుతున్నారు.

ఒంటికాలిపై సీహెచ్‌ఓల నిరసన


ఒంటి కాలిపై నిరసన తెలియజేస్తున్న సీహెచ్‌ఓలు

పార్వతీపురంటౌన్: సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ వద్ద ఒంటికాళ్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్‌ఎంలతో సమానంగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలని డిమాండ్ చేశారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలు తక్షణమే చెల్లించి క్రమబద్ధీకరించాలని కోరారు. నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలన్నారు. హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా పితృత్వ సేవలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె నోటీసు

- ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె


సమ్మె నోటీసును అందిస్తున్న యూనియన్ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు

సాలూరు: లేబర్ కోడ్స్ రద్దుచేయాలని, కేంద్ర కార్మిక సంఘాలు , స్వతంత్ర ఫెడరేషన్లు ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు తెలిపారు.ఈ మేరకు సమ్మె నోటీసును శుక్రవారం రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఐసీడీఎస్ బడ్జెట్ పెంచాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, బాలసంజీవిని యాప్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్‌వై నాయుడు, శశికళ, గౌరీశ్వరి, ఉత్తరమ్మ, అరుణ, సుబ్బరావమ్మ, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

మట్టిపనులు సక్రమంగా జరగాలి

- ఎంపీడీఓ రమేష్ బాబు


తాళ్లబురిడిలో ఉపాధి హామీ వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్ బాబు

పార్వతీపురం రూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా చెరువుల్లో చేపట్టిన మట్టి పనులు సక్రమంగా చేయాలని, కొలతల ప్రకారం వేతనదారులు తవ్వకాలు జరిపితే గిట్టుబాటు వేతనాలు మంజూరవుతాయని ఎంపీడీఓ రమేష్ బాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని తాళ్ల బురిడి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా ఆయన పరిశీలించారు. పనులు జరుగుతున్న చెరువుల వద్దకు వెళ్లి వేతనదారులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులు జరిగేటప్పుడు వ్యక్తిగత హాజరు నమోదును తప్పనిసరిగా వేసుకోవాలని అలాగే నిబంధనలకు లోబడి కొలతల ప్రకారం మట్టి పనులు, తవ్వకాలు జరగాలన్నారు. పనులకు వచ్చిన వేతనదారుల హాజరును స్వయంగా వేసి పరిశీలించారు. వేసవి ఎద్దడి దృష్ట్యా మట్టి పనుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీడీఓను వేతన దారులు కోరారు.

మన్యం బంద్ ప్రశాంతం


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతున్న నాయకులు


మామిడిపల్లిలో బంద్ నిర్వహిస్తున్న గిరిజన సంఘం నాయకులు

సాలూరు: ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నియామకానికి రాష్ట్రప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం శుక్రవారం చేపట్టిన రాష్ట్ర బంద్ ప్రశాంతంగా ముగిసింది. నూరుశాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని, ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులకు మెగా డీఎస్సీ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ ఏజెన్సీ ఐటీడీఏ పరిధిలో 766 పోస్టుల్లో ఆదివాసీలకు దక్కేది కేవలం 42 పోస్టులు మాత్రమేనని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం గిరిజనులను దగా చేసిందని విమర్శించారు. జీఓ నంబర్ 3 రద్దు వల్ల ఆదివాసీలకు ఉద్యోగాలు అందక తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు జానకీరామ్, ప్రభాకర్, ఎన్‌వైనాయుడు, వెంకటరావు, సన్యాసిరావు, వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో బంద్

సాలూరు రూరల్: రాష్ట్రప్రభుత్వం రూల్‌ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని మెగా డీఎస్సీలో ఆదివాసీలకు కేటాయించిన పోస్టులు వారికే దక్కాలని రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీలు నిర్వహిస్తున్న బంద్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గిరిజన సంఘం నాయకులు బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు వంతల సుందర్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు ఆర్డినెన్స్ జారీ చేయాలని నూరుశాతం ఉద్యోగ ఉపాధ్యాయ నియామకాలు జరపాలని కోరారు.

ఇష్టానుసారం ఇసుక తవ్వకాలు


సువర్ణముఖి నది బ్రిడ్జి సమీపంలో నదిలో ట్రాక్టర్, జేసీబీ


ఇసుక తీయడంతో నదిలో ఏర్పడిన గోతులు


నది ఒడ్డునే తరలించడానికి సిద్ధంగా ఉన్న ఇసుక దిబ్బ

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నది నుంచి నిబంధనలకు విరుద్ధంగా జేసీబీతో ఇసుక తవ్వేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలో కోట్లాది రూపాయలతో నిర్మాణాలు జరుగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్‌అండ్‌బీ, రైల్వేబ్రిడ్జిలకు 200 మీటర్ల లోపు నదిలో ఇసుక తవ్వకాలు, మట్టి తవ్వకాలు చేయరాదని స్పష్టమైన మార్గదర్శకాలున్నాయి. కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న బ్రిడ్జిలు కూలిపోతాయని ఇసుక తీయరాదని అధికారులు చెబుతున్నా అధికారపార్టీ నాయకుల అండతో ఇసుక వ్యాపారాలు సాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు నదిలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జికి సమీపంలో కొంతమంది ప్రభుత్వపాలకుల పేర్లు చెప్పుకుని, బ్రిడ్జి నిర్మాణానికని జేసీబీ సహాయంతో తవ్వి ట్రాక్టర్లతో ఇసుకను రోజుకు 10 క్యూబిక్ మీటర్లు నదిఒడ్డుకు చేర్చుతున్నారు. ఒడ్డుకు చేర్చిన ఇసుక రాత్రి వేళల్లో తారస్, ట్రక్‌లతో దూర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పాలకులు ఇసుక ర్యాంప్‌లను దాటుకుని రెండు నెలలుగా రాక పోకలు చేస్తున్నప్పటికీ రహదారి పక్కనే అక్రమాలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అలాగే ఇసుక తీయడంతో నదిలో ఏర్పడిన గోతలను చూసిన వారు నదిలో స్నానాలు చేయడానికి భయపడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.